





తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com

ఎడిటర్ కాడేపాగు అశోక్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ





తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 135 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ శనివారం- 11 - ఏప్రిల్- 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,


## రాజ్యసభ సభ్యునిగా నీతీశ్ ప్రమాణం

### బిహార్ రాజకీయాల్లో ముగిసిన ఒక శకం



- నీతీశ్ చేత ప్రమాణస్వీకారం చేయించిన రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్
- నీతీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు

ఎన్నికల వేళ మోదీ గిమ్మిక్కులు- నియోజకవర్గాల

## పునర్విభజనతో పెను ముప్పు

- మహిళా రిజర్వేషన్ల అమలులో కుట్ర
- నియోజక వర్గాల పునర్విభజనపై విపక్షాల ఉమ్మడి పోరుకు ఖర్గే పిలుపు




ఢిల్లి : మహిళా రిజర్వేషన్ల అమలు విషయంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం తీవ్రంగా ఖండించారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేసేందుకు మోదీ సర్కార్ ప్రతిపాదించిన నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్ ) ప్రక్రియ తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. అంశంపై విపక్ష పార్టీలన్నింటితో కలిసి ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందిస్తామని, అందరం కలిసి ఐక్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనం కోసమే మోదీ ప్రభుత్వం ఏప్రిల్ 16 నుంచి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తోందని ఖర్గే ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును అత్యంత వేగంగా ఆమోదించేందుకు మిగతా..2లో

మహిళలకు, నిరుద్యోగులకు

## రూ.3000 ఆర్థిక సాయం

- బంగాల్ బీజేపీ మేనిఫెస్టో ఇదే!
- సోనార్ బంగ్లా రోడ్ మ్యాప్
- బంగాల్ ఎన్నికల కోసం 15 అంశాలతో బీజేపీ మేనిఫెస్టో విడుదల
- రాష్ట్రంలోని మహిళలకు నెలకు రూ.3వేలు చొప్పున నగదు బదిలీ చేస్తామని తమ బీజేపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు.


వివరాలు 2లో..

ఢిల్లి : బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ శుక్రవారం విడుదల చేసిన తన మేనిఫెస్టోలో వరాల జల్లు కురిపించింది. బీజేపీ కనుక అధికారంలోకి వస్తే చొరబాటుదారులపై కఠిన వైఖరి అవలంబిస్తామని స్పష్టం చేసింది. బంగాల్ లోని ప్రతి మహిళకు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన 45 రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏడో వేతన సంఘం ఏర్పాటు చేస్తామని పేర్కొంది. బంగాల్ ఎన్నికల కోసం బీజేపీ శుక్రవారం సంకల్ప పత్రం (మేనిఫెస్టో) విడుదల చేసింది. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ సంకల్ప పత్రం రైతులు, మహిళలు, యువతకు మార్గనిర్దేశం చేస్తుందని అన్నారు.

గుంపు మేస్త్రీ అంటూ..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు



- ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని,
- ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు.

హైదరాబాద్: హైదరాబాద్ నగరాభివృద్ధి ముసుగులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో

కేసీఆర్‌ను కలిసిన జీవన్ రెడ్డి.. 'దేవుడే నన్ను పంపాడు'

## అంటూ భావోద్వేగం

- కేసీఆర్ ఆయనను సాదరంగా ఆహ్వానించి, ఆలింగనం చేసుకుని, శాలువాతో సన్మానించారు.
- "అన్నా.. నన్ను దేవుడే మీ దగ్గరికి పంపాడు, మీతో కలిసి పనిచేయమని కోరాడు"
- చాలా కాలం తర్వాత ఇన్నాళ్లకు కలిసి పనిచేసే అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.
- కేసీఆర్‌ను చూడగానే జీవన్ రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు.



తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఈరోజు కలిశారు. కేసీఆర్ ఆయనను సాదరంగా ఆహ్వానించి, ఆలింగనం చేసుకుని, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డితో పాటు ఆయన కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కూడా ఆయనతో పాటు ఉన్నారు. పాత మిత్రులు కలవడంతో అక్కడ ఎంతో ఆత్మీయ వాతావరణం నెలకొంది. కేసీఆర్‌ను చూడగానే జీవన్ రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. "అన్నా.. నన్ను దేవుడే మీ దగ్గరికి పంపాడు, మీతో కలిసి పనిచేయమని కోరాడు" అంటూ తన మనసులోని మాటను పంచుకున్నారు. తెలంగాణకు నష్టం జరుగుతున్న ప్రస్తుత తరుణంలో కేసీఆర్ నాయకత్వంలో మిగతా..2లో

టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్...

## పెరిగిన కరవు భత్యం

- ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది.
- ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది.
- గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నాటికి ఆర్టీసీ సుమారు రూ.954 కోట్ల నిర్వహణ లాభాన్ని నిర్జించింది.



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు. తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. మిగతా..2లో

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!



ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు.

అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

ఢిల్లి : ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో మిగతా..2లో

## బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి..



అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు.

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మిగతా..2లో

స్థానిక ఎన్నికలపై

## అప్రమత్తంగా ఉండాలి




- స్థానిక సంస్థల ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు.
- స్థానిక ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

క్రిమినల్ తో రాజకీయాలు చేసేటప్పుడు

## చాలా జాగ్రత్తగా ఉండాలి'

### మంత్రులకు సీఎం దిశానిర్దేశం

- కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరం
- ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు ప్రచారం చేసే కుట్రలను నిత్యం తిప్పికొట్టాలి
- కేబినెట్ అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో చర్చించిన సీఎం చంద్రబాబు





అమరావతి : కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరమని సీఎం చంద్రబాబు అన్నారు. నేరగాళ్లతో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు ముగిశాక ఇతర అంశాలపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం మిగతా..2లో

మహిళల జోలికొస్తే

## అదే చివరి రోజు

కడప జిల్లాలో విద్యార్థిని హత్య కేసుపై మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విద్యార్థిని హత్య అత్యంత బాధాకరమని మంత్రి అన్నారు.



కడప: జిల్లాలో విద్యార్థిని హత్య కేసు ఉదంతం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఓ బాలికను ప్రేమోన్మాది అత్యంత పాశవికంగా గొంతు కోసి హతమార్చడం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై ఏపీ మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రేమపేరుతో బాలికను హత్య చేశాడని తెలుసుకుని ఆమె ఆవేదనకు గురయ్యారు. విద్యార్థిని హత్య అత్యంత బాధాకరమని మంత్రి అన్నారు. మిగతా..2లో

## మొదటి పేజీ తరువాయి

## మహిళల జోలికొస్తే అదే చివరి రోజు: మంత్రి సవిత..

ఎంతో భవిష్యత్తు కలిగిన బాలిక హత్యకు గురికావడం మనసును కలిచివేస్తోందని చెప్పారు. బాలిక కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని.. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఇంకెవరూ మహిళల వైపు కన్నెత్తి చూడకుండా ఉండేలా శిక్షిస్తామని బాధిత కుటుంబానికి మంత్రి సవిత భరోసా కల్పించారు. నిందితుడు ఎంతటి వాడైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మహిళలు, బాలికల పట్ల ఉన్మాదుల్లా వ్యవహరిస్తే ఉక్కుపాదంతో అణిచివేస్తామని హెచ్చరించారు. మహిళలపై సైకోల్లా ప్రవర్తిస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని ఆగ్రహించారు. కూటమిది మహిళా పక్షపాత ప్రభుత్వమని అన్నారు. యువత బాధ్యతతో మెలగాలని.. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. మగ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని మంత్రి సవిత విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన కడప జిల్లా ఖాజీపేట మండలంలో ఈరోజు జరిగింది. ఆంజనేయకోట్టాలు గ్రామానికి చెందిన అవుల వెంకటేశ్, అదే మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలికను ప్రేమపేరుతో వేధించాడు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమె నిరాకరించడంతో గొంతు కోసి మరీ దారుణంగా హతమార్చాడు. హత్య అనంతరం గంటల వ్యవధిలోనే నిందితుడు వెంకటేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనతో రెండు గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## స్థానిక ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలి

అమరావతి, ఏప్రిల్ 10 : స్థానిక సంస్థల ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఈరోజు(శుక్రవారం) మంత్రులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. స్థానిక ఎన్నికలు రాబోతున్నాయని.. అందరు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. కార్యకర్తలను, నేతలను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. మంత్రులు అందరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూర్తిగా అందుబాటులో ఉండాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఎన్ని కార్యక్రమాలు ఉన్నా టీడీపీ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు అందుబాటులో ఉండి తీరాల్సిందేనని హుకుం జారీ చేశారు. పార్టీ ముఖ్యమనే విషయాన్ని అందరు గుర్తు పెట్టుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎందుకంటే పార్టీ కార్యకర్తలు ఇచ్చే విజ్ఞప్తులను మనం పూర్తిస్థాయిలో పరిష్కరించాలని మంత్రి నారా లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.

## కేసీఆర్‌ను కలిసిన జీవన్ రెడ్డి..
## 'దేవుడే నన్ను పంపాడు' అంటూ భావోద్వేగం

పనిచేయాల్సిన అవసరం ఉందని జీవన్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. చాలా కాలం తర్వాత ఇన్నాళ్లకు కలిసి పనిచేసే అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతకు ముందు, ఎర్రవెల్లికి చేరుకున్న జీవన్ రెడ్డికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఘనస్వాగతం పలికారు.

## టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్... పెరిగిన కరవు భత్యం

ఈ నిర్ణయంతో సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. డీఏ పెంపు నిర్ణయం 2026 జనవరి నుంచే అమల్లోకి వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల బకాయిలను రాబోయే నెలల్లో సప్లిమెంటరీ బిల్లుల ద్వారా విడతలవారీగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా అదనంగా రూ.2.82 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఏటా జనవరి, జులై నెలల్లో డీఏను సవరిస్తారు. గత ఏడాది జులైలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.1 శాతం డీఏ పెంచింది. తాజాగా మరోసారి డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, సంస్థ ఆదాయం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నాటికి ఆర్టీసీ సుమారు రూ.954 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొత్త బస్సులను కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా లాభాలను మరింత పెంచుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది.

## మహిళలకు, నిరుద్యోగులకు రూ.3000 ఆర్థిక సాయం

బంగాల్ సంస్కృతిని చూసి ˊర్వపడే ప్రతి పౌరుడికి ఇది సరికొత్త ఆశలు కల్పిస్తుందన్నారు. ఈ పత్రం 'సోనార్ బంగ్లా' (బంగారు బంగాల్) సృష్టికి ఒక రోడ్ మ్యాప్ అని పేర్కొన్నారు.

### మహిళలను ఆకట్టుకునేందుకు!

మహిళా ఓటర్లను ఆకట్టుకులనేందుకు, రాష్ట్రంలోని మహిళలకు నెలకు రూ.3వేలు చొప్పున నగదు బదిలీ చేస్తామని తమ బీజేపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. అలాగే పోలీస్ ఫోర్స్ తో సహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు. మమతపై విమర్శల జల్లుమరోవైపు అధికారంలో ఉన్న మమత బెనర్జీ ప్రభుత్వంపై అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలన ప్రజలకు ఒక పీడకలగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. "ప్రజలు ఎంతో ఆశతో మమతా దీదీకి అధికారం ఇచ్చారు. కానీ ఈ రోజు వారే మార్పు కోరుకుంటున్నారు" అని అన్నారు.

## గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
## లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు

భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని, అయితే ఆ నిధులను నగర అభివృద్ధికి వెచ్చించకుండా దారి మళ్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా స్వయంగా ముఖ్యమంత్రే ఉన్నారని గుర్తు చేస్తూ, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ముఖ్యంగా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను తుంగలో తొక్కారని కవిత ఆరోపించారు. గతంలో నామినేషన్ పద్ధతిలో జరిగిన పనుల కంటే, రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 1,140 కోట్ల రూపాయల కాంట్రాక్టులను అదే పద్ధతిలో అప్పగించారని, ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. పారదర్శకమైన టెండర్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండికొట్టి, కేవలం అవినీతి కోసమే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో సరికొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. జీహెచ్ఎంసీ పాలన ప్రస్తుతం 'గుంపు మేస్త్రి' చేతుల్లో చిక్కి మహా అవినీతికి నిలయంగా మారిందని ఆమె వ్యాఖ్యానించారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో గతంలో సిట్ వేయించిన ముఖ్యమంత్రి, ఇప్పుడు అదే కాంట్రాక్టును ఎలా కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

## భోగాపురం విమానాశ్రయం
## ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

## బీఆర్ఎస్ ఆరోపణలపై
## తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి..

ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు.

## క్రిమినల్ తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి'

### మొదటి పేజీ తరువాయి

దాదాపు 3గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. కేబినెట్ అజెండా అంశాలు ముగిశాక మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు అంశాలపై చర్చించారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు మంత్రులు ఓనర్ షిప్ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి 4 కార్యక్రమాల్లోనైనా పాల్గొనాలని సూచించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యేలా పనులు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకం కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలి : ఈ సందర్భంగా కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరమన్న సీఎం




అన్నారు. క్రిమినల్ తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సీఎం సూచించారు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ప్రచారం చేసే క్రిమినల్ కుట్రలను మంత్రులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ తిప్పికొట్టాలని సూచించారు. ప్రజలకు వాస్తవాలు చెప్తూ వారిని చైతన్య పరచాలన్నారు. బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలని ఆదేశించారు. కార్యదర్శుల పనితీరుపై చంద్రబాబు అసంతృప్తి : అంతకు ముందు కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. క్యాబినెట్ భేటీ ప్రారంభమైనా, అజెండా తమకు రాలేదని సీఎం వద్ద మంత్రి మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని క్యాబినెట్ కు వచ్చే వీలు ఉండేదని అన్నారు. దీనిపై స్పందించిన సీఎం కార్యదర్శుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు మరింత ఉపసయోగపడాల్సిందిపోయి రాను రానూ మరింత సంక్లిష్టంగా మారుతున్నాయని అధికారుల తీరును చంద్రబాబు తప్పుబట్టారు. డీమ్డ్ యూనివర్సిటీలను ఎక్కువ ప్రామోట్ చేయాలి : గతంలో కార్యదర్శులు సబ్జెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రామోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలకు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ, ఎక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని అన్నారు.

## ఎన్నికల వేళ మోదీ గిమ్మిక్కులు- నియోజకవర్గాల పునర్విభజనతో పెను ముప్పు

### మొదటి పేజీ తరువాయి

మోదీ సర్కార్ ఆసక్తి చూపుతోందని, ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు. దిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలు దేశ ఎన్నికల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూసే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం 'ఇందిరా భవన్ 'లో మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ , జైరాం రమేశ్, సచిన్ పైలట్ , కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ విధంగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు ముందు కాంగ్రెస్ సీడబ్ల్యూసీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

అంత హడావుడి ఎందుకు?

మోదీ సర్కార్ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కీలక బిల్లులను ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోంది. అందులో 2029 పార్లమెంట్ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడంతోపాటు, లోకసభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 816కు పెంచి, అందులో 273 స్థానాలను మహిళలకు కేటాయించేలా బిల్లులు పెట్టనున్నారు. కాగా, 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు, లోక్ సభ స్థానాలకు పెంచేందుకు సంబంధించిన ముసాయిదా బిల్లులకు కేంద్ర మంత్రివర్గం బుధవారమే ఆమోదం తెలిపినట్లు సమాచారం. అయితే ఇదంతా ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుత తమిళనాడు, బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందడం కోసమే చేస్తున్నారని కాంగ్రెస్ సహా విపక్షాలు అన్నీ విమర్శిస్తున్నాయి.

### ప్రమాదకర పరిణామాలకు దారితీయెచ్చు!

కాగా, ప్రభుత్వం హడావుడిగా చేపడుతున్న డీలిమిటేషన్ ప్రక్రియ ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ఇన్ ఛార్జ్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ హెచ్చరించారు. ప్రస్తుతమున్న నియోజకవర్గాల సంఖ్య విషయంలో తాము ఎలాంటి అస్థిరత కలగకూడదని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన విషయంలో రాజ్యాంగాన్ని సవరించడానికి ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కాంగ్రెస్ కేంద్రాన్ని హెచ్చరించింది. ఇది చాలా సున్నితమైన అంశమని, ఈ ప్రక్రియ వల్ల తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం



జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. వీటితోపాటు పశ్చిమాసియా ఉద్రిక్తతలు గురించి, అమెరికా, ఇజ్రాయెల్ , ఇరాన్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం గురించి కూడా సీడబ్ల్యూసీలో కాంగ్రెస్ సమీక్షించింది. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మండిపడింది. కాల్పుల విరమణ విషయంలో పాకిస్థాన్ కీలక పాత్ర పోషించిందని, తద్వారా విదేశాంగ విధానంలో మన దేశం వెనుకబడేలా మోదీ సర్కార్ చేసిందని దుయ్యబట్టింది. కాల్పుల విరమణ చర్చల విషయంలో ప్రధాని మోదీ ఎక్కడా ఎందుకు కనిపించలేదని ప్రశ్నించింది.

## రాజ్యసభ సభ్యునిగా నీతీశ్ ప్రమాణం- బిహార్ రాజకీయాల్లో ముగిసిన ఒక శకం

### మొదటి పేజీ తరువాయి

ఢిల్లి : బిహార్ రాజకీయాల్లో ఒక శకం ముగిసింది. దశాబ్దాల పాటు రాష్ట్ర రాజకీయాలను శాసించిన నీతీశ్ కుమార్ జాతీయ రాజకీయాల్లోకి పునరాగమనం చేశారు. రాజ్యసభ సభ్యుడిగా శుక్రవారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో బిహార్ ముఖ్యమంత్రిగా తన రెండు దశాబ్దాలు ప్రస్థానానికి తెరపడినట్లయ్యింది. అంతేకాకుండా, బిహార్ అధికార పగ్గాలను చేపట్టాలని ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బీజేపీ కల నెరవేరబోతోంది. రెండు దశాబ్దాలుగా ఎన్డీఏ కూటమిని నీతీశ్ కుమార్ అంతా తానై నడిపించారు. ఒకరకంగా చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాల్లో ఆయన ఎన్డీఏకు ముఖచిత్రంగా ఉన్నారు. ఇప్పుడు ఆయన జాతీయ రాజకీయలకు వెళ్లడంతో బిహార్ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారబోతోంది.

### నెరవేరిన నాలుగు సభల కల

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోని నాలుగు చట్టసభలైన అసెంబ్లీ,



మండలి, లోక్‌సభ, రాజ్యసభలో పని చేయాలనేది నీతీశ్ కుమార్ చిరకాల కోరిక. శుక్రవారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం స్వీకారం చేయడంతో ఆయన కల నెరవేరింది. తద్వారా నాలుగు చట్టసభలలో పనిచేసిన అతికొద్ది మంది నాయకులలో ఒకరిగా నీతీశ్ కుమార్ నిలిచారు. 1985లో తొలిసారి నీతీశ్ ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1989లో తొలిసారి లోక్ సభకు ఎన్నికయ్యారు. కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. 2006లో మొదటిసారి ఆయన మండలి సభ్యుడు అయ్యారు. తాజాగా ఎగువ సభకు ఎన్నికై తన చిరకాల కోరికను నెరవేర్చుకున్నారు.

### దేశ రాజకీయాల్లో అరుదైన ఘటన- సీఎం టు రాజ్యసభ

నీతీశ్ కుమార్ పరిణామం సమకాలిన దేశ రాజకీయాల్లో అరుదైన ఘటన అని చెప్పొచ్చు. ఒక ముఖ్యమంత్రి రాజ్యసభకు ఎన్నిక కావడం రాజకీయాల్లో చాలా అరుదుగా జరిగిన సంఘటన. అయితే రాజ్యసభకు ఎన్నికైన తర్వాత నీతీష్ కుమార్ తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఆయన వెంటనే రాజీనామా చేయడానికి రాజ్యాంగపరమైన కారణాలు ఉన్నాయి. ఒక వ్యక్తి ఒకే సమయంలో అటు పార్లమెంట్, ఇటు శాసనసభలో సభ్యుడిగా ఉండకూడదని రాజ్యాంగంలోని ఆర్టికల్ 101 చెబుతోంది. ఇలాంటి సందర్భం వచ్చినప్పుడు రాజ్యాంగం 'ప్రొహిబిషన్ ఆఫ్ సైమల్టేనియస్ మెంబర్‌షిప్ రూల్స్, 1950' కింద వెసులుబాటును కల్పించింది. వ్యక్తి రెండు సభలకు ఎన్నికైనప్పుడు 14 రోజుల లోపు రెండింటిలో ఒక పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది ఆ నిబంధన చెబుతోంది. లేనిపక్షంలో వారి పార్లమెంట్ స్థానం కోల్పోయే అవకాశం ఉంటుంది. ఈ నిబంధన వల్లే నీతీశ్ తన ఎమ్మెల్సీ పదవికి మార్చి 30న రాజీనామా చేశారు.

## పాకిస్థాన్ గూఢచార మాడ్యూల్ గుట్టురట్టు చేసిన దిల్లీ పోలీసులు
## సీసీటీవీ'లతో సైనికుల కదలికలపై నిఘా పెట్టిన ఉగ్రముఠా




పాకిస్థాన్ హ్యాండర్లతో ఉగ్రముఠాకు సంబంధాలు- 11 మంది అరెస్టు- సాంకేతికతను ఉపయోగించి సైనిక కదలికలపై నిఘా

ఢిల్లి : భారీ టెర్రర్ మాడ్యూల్‌ను దిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ శుక్రవారం ఛేదించింది. పాకిస్థాన్ కు గూఢచర్యం చేస్తున్న 11 మందిని అధికారులు అరెస్టు చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ ఐ) కనుసన్నల్లో ఈ ముఠా పని చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ముఠా ప్రధానంగా గూఢచర్యం, ఆయుధాల అక్రమ రవాణా, సైనిక స్థావరాలపై రహస్య పరిశీలన వంటి కార్యకలాపాల్లో నిమగ్నమై ఉందని అధికారులు తెలిపారు. ఈ ముఠా సైనిక స్థావరాల కదలికలను కనిపెట్టడానికి సోలార్ పవర్‌తో నడిచే సీసీటీవీ కెమెరాలను రహస్యంగా ఏర్పాటు చేసినట్లు గుర్తించిన అధికారులు విస్తుపోయారు. పంజాబ్, హరియాణ, జమ్ముకశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని సున్నిత ప్రాంతాల వద్ద సౌరశక్తితో పనిచేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. ఇప్పటివరకు దాదాపు 9 కెమెరాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు అధికారులు. ఈ కెమెరాలు మొబైల్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లో ఉన్న హ్యాండ్లర్లకు లైవ్ వీడియో పంపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫేక్ ఐడీలతో సిమ్ కార్డులు తీసుకుని ఈ వ్యవస్థను నిర్వహించినట్లు తెలిసింది. ఈ ముఠా పంజాబ్‌లోని జలంధర్, పఠాన్‌కోట్, కపూర్తల, పాటియాలా, మోగా, హరియాణాలో అంబాలా, జమ్ముకశ్మీర్‌లో కథువా, రాజస్థాన్‌లో బికానేర్, అల్వార్ వంటి ప్రాంతాల్లో కెమెరాలు అమర్చినట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో సైనిక దళాల రాకపోకలు ఎక్కువగా ఉండటం, అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంగా ఉండటం వల్లే ముఠా వాటిని లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

### రెండు ఆపరేషన్స్

పోలీసులు ఈ ఉగ్రముఠాను రెండు ఆపరేషన్స్ లో ఛేధించారు. స్పెషల్ సెల్ నార్త్ రేంజ్ బృందాల నేతృత్వంలో జరిగిన మొదటి ఆపరేషన్ లో పంజాబ్ , దిల్లీకి చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. వీరివద్ద నుంచి 9 సీసీ కెమెరాలు, 4 తుపాకులు, 24 కాట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు సౌత్ వెస్ట్ రేంజ్ నిర్వహించిన రెండో ఆపరేషన్ లో పంజాబ్‌లో మరో ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసుల విచారణలో నిందితులు కీలక విషయాలను వెల్లడించారు. ఆయుధాలు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ద్వారా వచ్చే డబ్బుతో తమను ఈ నెట్ వర్క్ లోకి ఆకర్షింపజేశారని నిందితులు పోలీసుల విచారణలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పంజాబ్ లోని తార్న్ తారన్‌కు చెందిన మన్ ప్రీత్ సింగ్ అనే వ్యక్తి ఈ ముఠాలో ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. మన్ ప్రీత్ పాక్ హ్యాండ్లర్లతో నేరుగా సంబంధాలు కొనసాగిస్తూ ఆయుధాల సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థను సమన్వయం చేయడంలో ఇతను కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.

### కీలక ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి పాక్ కు చేరవేత

దీర్ఘకాలిక గూఢచార కార్యకలాపాలను కొనసాగించడానికి స్థానిక యువతను నియమించుకోవడం, వారితో తమ నెట్‌వర్క్‌ను విస్తరించడం వంటి బాధ్యతలను కూడా ఈ మాడ్యూల్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో కొందరు ఆర్మీ కంటోన్మెంట్ల వద్ద రెక్కీ నిర్వహించడం, సరిహద్దు అవతల ఉన్న హ్యాండ్లర్లతో ఫొటోలు, వీడియోలను పంచుకోవడంలో ఈ ముఠా ప్రధాన పాత్ర పోషిస్తునట్లు గుర్తించారు. ఈ క్రమంలో అన్మోల్ అనే నిందితుడు తన సహచరుడు సాహిల్, పలు ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే బాధ్యత తీసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి అయ్యింది. వీటితో పాటు పోలీసుల దర్యాప్తులో మరికొన్ని కీలక విషయాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ మాడ్యూల్ భద్రతా స్థావరాలపై గ్రెనేడ్లతో దాడులు చేయాలని కూడా ప్రణాళికలు రచించినట్లు సమాచారం. అయితే, ఈ అరెస్టులతో పెద్ద ఉగ్రదాడిని ముందుగానే అడ్డుకున్నామని అధికారులు తెలిపారు. కాగా, సీసీటీవీ డేటా, మొబైల్ ఫోన్లలోని సమాచారాన్ని విశ్లేషిస్తూ మరిన్ని లింకులు వెలికితీయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## దమ్మైగూడలో దోమల నివారణ అవగాహన కార్యక్రమం

### - దమ్మాయిగూడ ఎక్స్ రోడ్ నుండి పిఎస్ రావు నగర్ వరకు బైక్ ర్యాలీ..








హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 10( వార్త నిర్భయం) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ పరిధిలో మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈరోజు 99డేస్ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఎంటమాలజీ మరియు సానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణ అవగాహన కార్యక్రమం కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ లో దమ్మాయిగూడ ఎక్స్ రోడ్ నుండి పిఎస్ రావు నగర్ వరకు బైక్ ర్యాలీ మరియు ఇంటింటికి అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగినది, ఈ కార్యక్రమంలో డిఈ సంతోష్ ఏఈ లు అనిల్, భాస్కర్ తిరుపతి రాజు, శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ దుర్గా , ఎంటమాలజీ సిబ్బంది సానిటేషన్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## 99 రోజుల కార్యచరణలో భాగంగా అవగాహన ర్యాలీ







హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 10 (వార్త నిర్భయం)

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘట్కేసర్/పోచారం డివిజన్ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యచరణలో భాగంగా, ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్ చౌదరిగుడలో ' వేక్టర్ బోర్న్ డిసీజెస్' దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు పై శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వాణి మాట్లాడుతూ. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిశుభ్రతను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వాణి తో పాటు ఏ ఈ ఈ చంద్రశేఖర్ , ఏఎంసీ శశి కుమార్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మేఘన్న అభయస్తం ద్వారా ఆర్థిక సహాయం.



ఏదుల మండలం ఏప్రిల్ 10( వార్త నిర్భయం )

ఏదుల మండలం కేంద్రంలో చెన్నారం గ్రామం.ఉప్పరి బాలయ్య 60 సంవత్సరాలు ఆరోగ్యం బాగాలేక మృతి చెందారు చెన్నారం గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు ఏదుల మండలం కాంగ్రెస్ నాయకులు.పందెం సుఖేందర్ రెడ్డి తెలియజేశారు ఆయన.ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డిఅభయస్తం ద్వారా చనిపోయినఉప్పరి బాలయ్య కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారుకార్యక్రమంలో బందెల శ్రీనివాస్ రెడ్డి బుద్ధం శ్రీకాంత్ రెడ్డి గుంటి సురేందర్ మిద్దె కుర్వ కరుణాకర్ 11 వార్డ్ నంబర్ బంకల గిరిబాబు 12 వార్డ్ సభ్యులు దంజనేయులు ఆవుల పవన్ కుమార్ బంకల రాములు దోల్ రామ్ పాశం వెంకట్ స్వామి పాల్గొన్నారు

## పాలెం వెంకన్న దేవాలయంలో

## మహిళాచే లలిత సహస్ర పారాయణ పఠనం...



నాగర్ కర్నూల్ బ్యూరో ఏప్రిల్ 10 (వార్త నిర్భయం)

బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో శ్రీ అలెర్మెల్ మంగ సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం నాడు మహిళల భక్తుల ఆధ్వర్యంలో శ్రీ లలిత సహస్రనామాలు మరియు శ్రీ లక్ష్మీదేవి అష్టోత్తర శతనామావళి పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం నాడు 20 మంది మహిళలచే ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరి,సూర్య కళ లు తెలిపారు. అనంతరం సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పద్మ,చంద్రకళ ప్రసన్న,రజిత,శోభ కృష్ణమ్మ,కవిత,రాధా శ్రీదేవి,జ్యోతి,లక్ష్మి,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రాజకీయ సాధికారతకు చారిత్రాత్మక నిర్ణయం.

### - రిజర్వేషన్ బిల్లుకు మోదీ పిలుపు



హైదరాబాద్: ఏప్రిల్ 10 (వార్త నిర్భయం)

భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల చట్టసవరణ బిల్లుకు ప్రారంభ లెక్కలు మొదలైన నేపథ్యంలో, ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశాలకు హాజరై బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు. 2029 సాధారణ ఎన్నికల నుండి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ బిల్లు దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే కీలక సంస్కరణగా భావిస్తున్నారు. భారతదేశ నాగరికతా స్ఫూర్తికి ఇది ఒక ధృవీకరణగా నిలుస్తుందని, దేశాభివృద్ధిలో మహిళల కీలక పాత్రను గుర్తించి వారి సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. మహిళల ప్రతినిధిత్వాన్ని పెంచడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని, భావితరాల భవిష్యత్తుకు ఇది ఒక కీలక నిర్ణయమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఈ బిల్లుపై ఆసక్తి నెలకొంది.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు అవసరమైన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### - మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి..









హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 10 (వార్త నిర్భయం)

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాపరిధిలోని కూకట్ పల్లి, ఎల్లమ్మబండ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూరోజుకు ఎంత ఓపి ఉంటుందని, ఆసుపత్రిలోని మౌలిక వసతుల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సెంటర్ కు ఎంత మంది ఆశావర్కర్లు ఉన్నారని కలెక్టర్ అడుగగా, ఆశావర్కర్ల కొరత ఉందని మెడికల్ ఆఫీసర్ వివరించారు. ఆసుపత్రికి అదనపు గదులు, టాయిలెట్లు కావలసినవి కలెక్టరును కోరగా, అవసరమైన మరమ్మత్తులకు, నిర్మాణాలకు అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిని పరిశీలించి లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఫార్మసిస్ట్‌కు ఔషధాల నిల్వలను సమర్థంగా నిర్వహిస్తూ, ఎమర్జెన్సీ కార్నర్‌ను సక్రమంగా ఉంచాలని సూచించారు. పేషంట్లకు మందులు అందించేటప్పుడు ఎక్స్పైరీ డేట్ చెక్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిష్టర్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్, ఇమ్యునైజేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం అవసరమైన నిధులను సమకూర్చుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# హైకోర్టు స్టే తో ఎగురని హెలికాప్టర్

### సోమశిల శ్రీశైలం హెలికాప్టర్ ప్రయాణానికి హైకోర్టు బ్రేక్ పరేషాన్ లో పర్యాటకులు.



నాగర్ కర్నూల్ బ్యూరో ఏప్రిల్ 10 (వార్త నిర్భయం) నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని పవిత్ర పుణ్యక్షేత్రం సోమశిల నుంచి వయా శ్రీశైలం హైదరాబాద్ వరకు తెలంగాణ పర్యాటకశాఖ ఈనెల 9 నుంచి ప్రారంభం చేయబోయే హెలి టూరిజం పర్యటన హైకోర్టు బ్రేకు వేసింది. సోమశిల లోని ద్వాదశ జ్యోతిర్లింగాల తో కొలువైన శ్రీ లలితాంబికా సోమేశ్వర క్షేత్రం తో పాటు శ్రీశైలం పుణ్యక్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి అమ్మవారి దర్శనం దర్శనం అక్కడి అందాలు చూడదగ్గ ప్రదేశాలను పర్యాటకులకు టూరిజం శాఖ హెలికాప్టర్ ద్వారా వీక్షించే అవకాశం కల్పిస్తున్న సందర్భంలో సోమశిల దగ్గర హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు నష్టం జరుగుతుందని ఈ విషయం పైన కొల్లాపూర్ బిజెపి నాయకుడు ఏ సుధాకర్ రావు తో పాటు ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు ముందస్తు రైతుల అనుమతి లేకుండా ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా అన్యాయంగా అక్రమంగా అధికార పార్టీ నాయకులు మంత్రి అధికారులను అడ్డం పెట్టుకొని బలవంతంగా రైతుల భూములను హెలికాప్టర్ నిర్మాణంపై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం వల్ల హైకోర్టు రైతుల అనుకూలంగా స్టే విధిస్తూ ఆదేశాలను జారీ చేసింది. దీంతో టూరిజం హెలికాప్టర్ ప్రయాణానికి తూట్లు పడ్డాయి. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించే వనరులు ఉన్నప్పటికీ నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ఆర్థికంగా వెనుక పడుతున్న ఈ ప్రాంతంలో మామిడి పరిశ్రమతో పాటు కాగితపు పరిశ్రమ, చేపల పరిశ్రమ, తదితర ఉపాధి కల్పించే పరిశ్రమలను నెలకొల్పకుండా ధనవంతుల కోసం శ్రీమంతుల కోసం గాలి మోటర్ ప్రయాణం కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవడం పట్ల ఈ నియోజకవర్గంలోని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గాలి మోటార్ ప్రయాణం పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉపయోగం లేదని ఒక్కొక్కరికి 1,30,000 టికెట్ తో ఈ ప్రయాణం సామాన్యుడు చేసే పరిస్థితి లేకపోయినప్పటికీ టూరిజం శాఖ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక అంతర్యం ఏముందని ప్రశ్నలు వస్తున్నాయి. సోమశిల లో హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం నిర్మాణం చేస్తున్న భూములు రైతులు కష్టపడి సంపాదించుకున్న వ్యవసాయ భూములు జీవనోపాధి కల్పించే స్థిరాస్తులు కోల్పోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ గాలి మోటర్ ప్రయాణం నిలిచిపోవడంతో ఒక్కసారిగా ఈ ప్రాంత ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. టూరిజం హెలికాప్టర్ ప్రయాణం రద్దు కావడంతో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాదులోని మెట్రో రైల్లో ప్రయాణిస్తూ మరొకసారి ప్రయాణికులను అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. కొల్లాపూర్ ప్రాంతంలో హెలికాప్టర్ ప్రయాణం రద్దు కావడం మంత్రి మెట్రోలో ప్రయాణించడం వల్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొల్లాపూర్ ప్రాంతంలో శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరుద్యోగ యువతీ యువకులు డిమాండ్ చేస్తున్నారు. తరాలు మారిన ఈ ప్రాంత ప్రజల తలరాతలు మారడం లేదని ప్రజలు అంటున్నారు. అన్ని వనరులు ఉన్న అల్లుడి నోట్లో శని ఉన్నట్లు ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ ప్రాంతాన్ని గతంలోని వెలమ దొరల పాలనలో అభివృద్ధిలో వెనక్కి నెట్టివేయబడింది. దేశానికి స్వాతంత్ర సిద్ధించిన తర్వాత 60 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ పాలనలో సురభి వెలమ దొరల పాలన కొనసాగిందని నేటికి కూడా ఈ ప్రాంతంలో బహుజనులు అత్యధికంగా ఉన్నప్పటికీ రాజకీయాల్లో ముందుకు రాణించలేక పోతున్నారని చర్చ కొనసాగుతుంది. ఇప్పటికైనా రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా బహుజనులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే విధంగా పాలక ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు మొదలు పెట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉత్తమమైన అంబులెన్స్ సేవలు

### ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవి.





అమరచింత ఏప్రిల్ 10 (వార్త నిర్భయం)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 మరియు 102 అంబులెన్సు అత్యుత్తమంగా పనిచేస్తున్నాయని అపర సంజీవనిల ఆదుకుంటున్నయని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె రవి పేర్కొన్నారు శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని 108/102 అంబులెన్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు అంబులెన్స్ లోని వివిధ రకాల పరికరాల పనితీరు మరియు మందులను పరిశీలించారు108 అంబులెన్స్ ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని ప్రమాద బాధితులను ఆపదలో ఉన్న వారిని వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని పేర్కొన్నారు 102 అమ్మఒడి అంబులెన్సులు గర్భిణీ స్త్రీలను ప్రసవపరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తిరిగి ఇంటికి చేర్చడం జరుగుతుంది ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన తర్వాత తల్లి బిడ్డలను ఇంటిదగ్గర ఉచితంగా దించడం జరుగుతుంది మరియు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ కోసం అమ్మఒడి వాహనాలను ఉపయోగిస్తున్నారని ఆయన పేర్కొన్నారులిఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 మరియు 102 అంబులెన్స్ ద్వారా ప్రజలకు వైద్య సహాయాన్ని అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ రత్నమయ్య ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కృష్ణ పైలెట్ అహ్మద్ పాల్గొన్నారు

## పోలీస్ శాఖలో జీతాల కుంభకోణం.

## రూ.1.40 కోట్లు దోచుకున్న ఉద్యోగి.



హైదరాబాద్ ఏప్రిల్ 10: (వార్త నిర్భయం)

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సంచలన ఘటన వెలుగుచూసింది. పోలీస్ శాఖలోనే భారీ స్థాయిలో జీతాల కుంభకోణం చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. సుమారు రూ.1.40 కోట్ల మేర ప్రభుత్వ నిధులు అక్రమంగా దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ నిర్వహించిన ప్రాథమిక విచారణలో, పే సెక్షన్‌లో గతంలో పనిచేసిన ఒక పోలీసు ఉద్యోగి ఈ కుంభకోణానికి పాల్పడినట్లు తేలింది. మరణించిన ముగ్గురు కానిస్టేబుళ్ల ఐఎఫ్, ఎంఐఎస్, ఎంప్లాయీ ఐడీలను దుర్వినియోగం చేస్తూ, ఇఫమిస్ పోర్టల్‌లో నకిలీ వివరాలు నమోదు చేసి జీతాలను డ్రా చేసినట్లు వెల్లడైంది. ఈ ప్రక్రియలో భాగంగా ప్రైవేట్ బ్యాంకుల్లో నకిలీ ఖాతాలను సృష్టించి, వాటికి తన వ్యక్తిగత మొబైల్ నంబర్లను అనుసంధానించి, 2022 నుండి 2026 వరకు నిరంతరం ప్రభుత్వ జీతాల సొమ్మును అక్రమంగా మళ్లించుకున్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం రూ.1,40,18,308/- వరకు నిధుల దుర్వినియోగం జరిగినట్లు విచారణలో స్పష్టమైంది. అక్రమంగా సంపాదించిన ఈ సొమ్ముతో వ్యక్తిగత రుణాలు తీసుకోవడం, వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేయడం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆలం గౌష్ ఆదేశాల మేరకు, సంబంధిత పోలీసు ఉద్యోగిపై కరీంనగర్ ×-టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కుంభకోణంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో అంతర్గత విచారణ కొనసాగుతోందని, పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

## వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు

## డాక్టర్ కడియం కావ్య జన్మదిన వేడుకలు "



వరంగల్ ప్రతినిధి ఎప్రిల్ 10 (వార్త నిర్భయం) హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా ఫోన్ ద్వారా డాక్టర్ కడియం కావ్య కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య గారి ప్రజాసేవా స్ఫూర్తిని, యువ నాయకత్వాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేఖ ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎంపీ డా. కడియం కావ్య ప్రజల పట్ల అంకితభావంతో పనిచేస్తూ మరింత ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. ఇక రాష్ట్ర, కేంద్ర స్థాయి మంత్రులు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అలాగే పలు సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఎంపీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మధ్య నిత్యం ఉంటూ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్న యువ నేతగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విశేష ఆదరణ పొందుతున్నారు. ఎంపీ నాయకత్వంలో వరంగల్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి మరింత వేగంగా కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య జన్మదిన వేడుకలు హర్షాతిరేకాల మధ్య ఘనంగా జరిగాయి.

## ముదిరాజ్ బిడ్డల ఆత్మగౌరవ పోరాటాన్ని అణిచివేయడం ఎవరి తరం కాదు నీలకంఠం ముదిరాజ్

సంగారెడ్డి జిల్లా బ్యూరో ఏప్రిల్ 10 (వార్త నిర్భయం )కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, ముదిరాజులను బీసీ–డీ (దీజ–ఱ) నుండి బీసీ–ఏ (దీజ–ఘా)లోకి చేరుస్తామన్న ఎన్నికల హామీని తుంగలో తొక్కడం అన్యాయం. ఏప్రిల్ 10 శుక్రవారం గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన ముదిరాజ్ నాయకులను, ముదిరాజ్ ప్రజలను రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అన్నారు ముదిరాజ్ హక్కుల కోసం పోరాడుతుంటే అక్రమ అరెస్టులతో అణిచివేయాలని చూడటం అప్రజాస్వామీ కమని అన్నారు ముదిరాజ్ కులానికి మాట ఇచ్చి తప్పిన కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ముదిరాజుల కు వర్గీకరణ మార్పుపై ఇచ్చిన హామీ కేవలం ఓట్ల కోసమేనా? రెండు ఏళ్లు దాటినా ఈ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం ముదిరాజ్ సమాజాన్ని వంచించడమే అనేది వాస్తవం. అణచివేత ధోరణి: కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియు తంగా నిరసన తెలపడానికి హైదరాబాద్ లో జరగబోయే హాలో ముదిరాజ్ చలో గాంధీభవన్ ముట్టడి కి వెళ్తున్న వారిని అర్ధరాత్రి నుంచి ఇళ్లల్లోనే గృహనిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రభుత్వ పిరికిపంద చర్య. అని అన్నారు రాజకీయ, ఆర్థిక వివక్ష తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులను రాజకీయంగా, ఆర్థికంగా ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. విద్య, ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించకపోవడం వల్ల ముదిరాజ్ బిడ్డల భవిష్యత్తు అంధకారమవుతోంది. అని అన్నారు ప్రభుత్వానికి ఇది హెచ్చరిక, లాఠీలతోనూ, అరెస్టులతోనూ ఉద్యమాలను ఆపలేరు. ముదిరాజుల ఆగ్రహానికి గురైన గత ప్రభుత్వమూ మనుగడ సాగించలేదు. అనేది గతంలో కామారెడ్డి ముదిరాజుల ధర్మ యుద్ధం ర్యాలీ ఒక నిలువెత్తు సాక్షంగా ఆనాటి ప్రభుత్వాన్ని కూల్చడానికి మొదటిగా అడుగుగా కామారెడ్డి నుండి ప్రారంభమైందనేది ఈరోజు ఉన్న ప్రభుత్వం గమనించాలి ముదిరాజులు ఏకమైతే ఏమవుతుందో ఆలోచన చేసి ముదిరాజులను బిసి డి నుండి బిసి ఏ లోకి తక్షణమే చేర్చాలి ఎలక్షన్ల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా మారుస్తామని ఆరోజు స్వయంగా ఈ నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజులకు మాట ఇచ్చి మోచేతికి బెల్లం పెట్టినట్టు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు తక్షణమే ముదిరాజులను బీసీ డీ నుంచి డి సి ఏ లోకి మార్చాలి అని నీలకంఠ ముదిరాజ్ డిమాండ్ చేశారు తెలంగాణలో ఉన్నటువంటి ముదిరాజ్ జర్నలిస్టులు అంతా ఏకమై ముదిరాజులను ఏకం చేసి ముందుండి ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి వెంటనే వర్గీకరణ ప్రక్రియను చేపట్టాలి. అన్నారుముదిరాజ్ జాతి డిమాండ్లు 1. అరెస్టు చేసిన ముదిరాజ్ నాయకులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలి అన్నారు 2. బీసీ–డీ నుండి బీసీ–ఏ కి మార్చే ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టమైన



కాలపరిమితితో కూడిన ప్రకటన చేయాలి. 3. ముదిరాజులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన ముదిరాజుల వాటా మేమెంతో మాకంత అనే విధంగా వాటా కనిపించాలి . ముదిరాజుల ఆత్మగౌరవం కోసం, ముదిరాజ్ హక్కుల సాధన కోసం చేస్తున్న ఈ పోరాటం ఆగదు. అని హెచ్చరించారు ప్రభుత్వం దిగివచ్చే వరకు ముదిరాజులు చేసే ఉద్యమం ఇంకా ఉధృతం చేసే విధంగా రాష్ట్రంలో ఉన్నటువంటి ముదిరాజ్ జర్నలిస్టులు మనస్ఫూర్తిగా పనిచేయాలని బాధ్యతగా పనిచేయాలని కోరుతూ ఈ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసే వరకు కొనసాగుతూనే ఉంటుంది. అన్నారు అని తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టు సంఘంరాష్ట్రఅధ్యక్షులు చింతల నీలకంఠం ముదిరాజ్ అన్నారు

# బహుజన మహానీయులను స్మరించుకుందాం..

**దండి వెంకట్ రాష్ట్ర అధ్యక్షులు**

**బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బి ఎల్ పి**

**తెలంగాణ రాష్ట్ర కమిటీ, హైదరాబాద్.**



హైదరాబాద్ ఏప్రిల్ 10 (వార్త నిర్భయం) వేల సంవత్సరాలుగా ఈ దేశ ఉత్పత్తి శక్తులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలకు ఆస్తి హక్కు, పాలన అధికారం లేకుండా బానిసలుగా మార్చిన ఆధిపత్య మనుధర్మశాస్త్ర దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమించిన భారత సామాజిక విప్లవకారులైన మహానీయుల జయంతులు, వర్ధంతులను 2026 ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతి బా పూలే, ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ల జయంతి ఉత్సవాలను గ్రామ గ్రామాన నిర్వహించాలని "బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బి ఎల్ పి తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తోంది." భారతదేశంలో వేల సంవత్సరాలుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అణచివేతను ఎదుర్కొంటున్న ఉత్పత్తి జాతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ప్రత్యేకంగా మహిళలపై బ్రాహ్మణాధిపత్య మనువాద దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమించిన బహుజన సామాజిక విప్లవకారుల జయంతి ఉత్సవాలు, వర్ధంతులు ఏప్రిల్ మాసంలోనే ఉండటం విశేషం.ఏప్రిల్ 2న తెలంగాణ మొదటి బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న గౌడ్,ఏప్రిల్ 3న తెలంగాణ బహుజన జాతుల సాయుధ.తిరుగుబాటు జెండా దొడ్డి కొమురయ్య జయంతి,ఏప్రిల్ 3న బహుజన చక్రవర్తి ఛత్రపతి శివాజీ వర్ధంతి,ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 9న చంద్ర రాజేశ్వర రావు 32 వ వర్ధంతి. ఏప్రిల్ 9 రాహుల్ సాంకృత్యాయన్ 133వ జయంతి.ఏప్రిల్ 11 జ్యోతిబా పూలే 199వ జయంతి.ఏప్రిల్ 12 కొండపల్లి సీతారామయ్య 24 వ వర్ధంతి.ఏప్రిల్ 13న బీసీ కులాలకు 27% రిజర్వేషన్లకు కృషి చేసిన మహానీయుడు బీపీ మండల్ వర్ధంతి,ఏప్రిల్ 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ 135 వ జయంతి.ఏప్రిల్ 14 వ తేదీ జార్జిరెడ్డి 54 వ వర్ధంతి.ఏప్రిల్ 16 కందుకూరి వీరేశలింగం 178 వ జయంతి. ఏప్రిల్ 17 కె జి సత్యమూర్తి 14 వ వర్ధంతి.ఏప్రిల్ 18 చార్వాక రామకృష్ణ 19 వ వర్ధంతి.ఏప్రిల్ 22 లెనిన్ 156 వ జయంతి .ఏప్రిల్ 30న విప్లవ కవి, రచయిత శ్రీశ్రీ జయంతి ఉత్సవాలను ఆధిపత్య ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, దోపిడికి వ్యతిరేకంగా ఘనంగా నిర్వహిద్దాం..మహాత్మా జ్యోతి బా పూలే, సావిత్రమ్మ పూలే, నారాయణ మేఘాజీ లోఖాండే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లు ఏ బహుజన సమాజానికి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వం కోసం ఉద్యమించారో ఆ సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధిలో బహుజన జాతులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలకు ఇంతవరకు సరైన భాగస్వామ్యం దక్కలేదు. అందు వల్లనే భారతదేశం ఇంకా అసమానతల సమాజంగా కొనసాగుతున్నది.దానికి కారణం గతంలో కాంగ్రెస్ ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలతోపాటు బీఆర్ఎస్ టిడిపి వైసిపి లాంటి ఆధిపత్య కులాల యాజమాన్యంలోని అగ్రవర్ణ/అగ్రకుల పెట్టుబడిదారుల ప్రతినిధులే కాబట్టి,బహుజన మహనీయులు ఆశించిన విధంగా బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ప్రత్యేకంగా మహిళలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కోసం బహుజన మహనీయుల మాసమైన ఏప్రిల్ మాసమంతా జయంతులు, వర్ధంతుల సందర్భంగా రాజ్యాంగ సామాజిక న్యాయ సూత్రాల పునాదులపై బహుజన శ్రామిక ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ రాజ్యాధికార సాధన లక్ష్యంగాపునరంకితమవుదామనితెలియజేస్తూ...జై భీమ్ లాల్ సలాంలతో... దండి వెంకట్

# మహిళ ఎంపీని మంత్రి అవమానిస్తున్నారు

**మంత్రి వాటికి శ్రీహరి చేతకాని పాలన.**

**ప్రోటోకాల్ కి విరుద్ధంగా మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన.**

**మంత్రి వాకిటి శ్రీహరికి ఎంపీ డీకే అరుణ సవాల్.**

**ఆత్మకూరు చౌరస్తాలో చర్చకు రండి**

**ఆత్మకూరు - కొత్తపల్లి బ్రిడ్జి అడ్డుకుంటుందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు.**

**బరాబర్ జూరాల సేఫ్టీ బ్రిడ్జి, ఆత్మకూరు ట్రాన్స్ఫర్ట్ బ్రిడ్జి కట్టండి.**

**ఎంపీ డీకే అరుణ**

వనపర్తి బ్యూరో ఏప్రిల్ 10 (వార్త నిర్భయం) ఆత్మకూరు, అమరచింత, మక్తల్ మున్సిపాలిటీలకు అమృత్ పథకం కింద నిధులు మంజూరు అయ్యాయి.అమృత్ పథకం కేంద్ర ప్రభుత్వ పథకం.. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, మున్సిపాలిటీలు ఈ పథకంలో భాగస్వామ్యులు.చెరువుల సుందరీకరణ,పార్కు, మురుగునీరు కలవకుండా అభివృద్ధి చేపట్టడం జరిగింది.ఆత్మకూరు,అమరచింత మున్సిపాలిటీలకు ఒక్కో మున్సిపాలిటీకి 3కోట్ల14లక్షల 60వేల రూపాయలు నిధులు వచ్చాయి.ప్రోటోకాల్ కి విరుద్ధంగా మాకు సమాచారం ఇవ్వకుండా మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేసి వెళ్ళారు.ప్రతి అధికారిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులుగా మాకు ఆహ్వానం అందించాలి.అడ్డుకుంటామని ఎవరిని బెదిరిస్తున్నారు..అభివృద్ధిని అడ్డుకుంటారా.కేంద్ర ప్రభుత్వ నిధులు అడ్డుకుంటారా..?మీ తాటి ఆకు చప్పుళ్లకు చింతకాయలు రాలవు.కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం ప్రజలకు చేరవేయడం మా



బాధ్యత.గ్రామాల్లో సీసీ రోడ్లు, అంగన్వాడీ,మహిళా సంఘాల భవనాలు లేవు.జీ రామ్ జీ పథకం ద్వారా మౌలిక వసతుల కల్పనలు రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వమంటే.. ఇవ్వం అంటారు.ప్రోటోకాల్ పాటించకుండా.. మహిళా ఎంపీని ఆయన నన్ను మీరు అవమానిస్తున్నారు ఆవేదన వ్యక్తం చేశారు భూమి పూజ చేస్తే.. మీకు కడుపు మంట ఎందుకు.?అభివృద్దే లక్ష్యంగా పని చేసే వ్యక్తిని నేను.కుసుమ్ పథకం కేంద్ర ప్రభుత్వ పథకం కదా..?సీఎంను స్థానిక మంత్రి ఒప్పించలేక.. ఇరిగేషన్ బ్రిడ్జిను.. ట్రాన్స్ఫర్ట్ బ్రిడ్జి గా మారుతున్నారు. జూరాల భద్రతకు ముప్పు ఉంది.. సేఫ్టీ బ్రిడ్జి పెట్టాలన్నారుజూరాల ప్రాజెక్ట్ పాలమూరు జిల్లాకు గుండె.మంత్రిగా ఉండి.. శ్రీహరి ట్రాన్స్ఫర్ట్ బ్రిడ్జి తేలేరా మీతో పాటు బ్రిడ్జి కోసం సీఎం వద్దకు నేను వస్తా పదండి.ఆత్మకూరు బ్రిడ్జి వస్తె నాకే మంచిది.. గద్వాల కు వెళ్లేందుకు సమయం తగ్గుతుంది.అరుణమ్మ అభివృద్ధి చేస్తుంది తప్ప.. అభివృద్ధి ఎప్పుడూ అడ్డుకోదు.ఇచ్చిన హామీలు అమలు చేయలేక రాష్ట్రం దివాళా తీసిందని చెబుతున్నారు. ప్రతి ఒక్క పేదవాడు ఆర్థికంగా ఎదగాలని ప్రధాని మోదీ పని చేస్తున్నారు

## ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన

## ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట బ్యూరో ఏప్రిల్ 10 వార్త నిర్భయం

ఛివ్వేంల మండలంలోని ఉండ్రుగొండ గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే మా నినాదం అని అన్నదాత అభ్యున్నతే మా విధానం అని చెమట చిందించే కర్షకుడికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా భరోసానిస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో ఛివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు దారావత్ వీరన్న నాయక్, గ్రామా సర్పంచ్ గుడిసె రామకృష్ణ, ఉప సర్పంచ్ పల్లేటి వీరమ్మ, గ్రామా శాఖ అధ్యక్షుడు మెడబోయిన నాగరాజు, వార్డు సభ్యులు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజాద్ అలి, పిసిసి ఎస్సి సెల్ వైస్ ఛైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వాణిజ్య సెల్ ఛైర్మన్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరెని శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం ఛైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, సేవదల్ చీఫ్ ఆలేటి మాణిక్యం, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్న మధుకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చెంచల నిఖిల్, నారాయణ ప్రవీణ్ రెడ్డి,నాగు నాయక్, మద్దెబోయిన శ్రీనివాస్, వాజిద్ మియా, యాలకపల్లి వెంకన్న, ఎపియం, వెలుగు సీసీ, సంఘ బంధం మహిళలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట నూతన

## అధ్యక్షుడిగా డా. యాదా కిరణ్ ఏకగ్రీవ ఎన్నిక



సూర్యాపేట బ్యూరో ఏప్రిల్ 10 వార్త నిర్భయం

సూర్యాపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట 2026–27 లయనిస్టిక్ సంవత్సరానికి గానూ నూతన కార్యవర్గ ఎన్నికలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. స్థానిక లయన్ సర్వీస్ సెంటర్లో ఉదయం 10:30 గంటలకు జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారులు ఎం.జె.ఎఫ్ లయన్ పెండెం చంద్రశేఖర్, ఎం.జె.ఎఫ్ లయన్ యామ రామమూర్తి, మరియు ఎం.జె.ఎఫ్ లయన్ తోట శ్యాం ప్రసాద్‌లు నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు.ఎన్నికైన నూతన కార్యవర్గం:అధ్యక్షుడు: లయన్ ఐతీ. యాదా కిరణ్వైస్ ప్రెసిడెంట్ 1: గుండా లక్ష్మయ్య వైస్ ప్రెసిడెంట్ 2: బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్కార్యదర్శి: చీకూరు కృష్ణగౌడ్కోశాధికారి: మిర్యాల వెంకటేశ్వర్లుసహాయ కార్యదర్శి: ఫణి కుమార్ బెజుగంసర్వీస్ చైర్ పర్సన్: కుమ్మరికుంట్ల లింగయ్యట్విస్టర్: శ్యామల సాంబశివరావుటేమర్: లక్ష్మీ ప్రసాద్ చల్లాఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట అధ్యక్షులు వీజీఫ్ లయన్ సుధాకర్ మిర్యాల గారు, లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్ దోసపాటి గోపాల్, డిస్ట్రిక్ట్ జి.ఎం.టి కోఆర్డినేట గుడిపురి వెంకటేశ్వరరావు, రీజియన్ చైర్పర్సన్ సంతోష్ కొండ, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్‌లు బండారు రాజా, రాజేంద్రప్రసాద్ వుప్పల పాల్గొన్నారు. అలాగే అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు బైరు వెంకన్న గౌడ్, సీనియర్ సభ్యులు ్రా. హరి సార్, ఎన్.వి. భాస్కరరావు, భోనగిరి విజయ్ కుమార్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డా. యాదా కిరణ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే సంవత్సరంలో సూర్యాపేట క్లబ్ ద్వారా మరిన్ని విస్తృతమైన సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన ప్రకటించారు.

## ఆయుష్, హోమియోపతి దినోత్సవ వేడుకలు



బోధన్ ఏప్రిల్ 10 వార్త నిర్భయం :తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా బోధన్ ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో ఆయుష్ డే, హోమియోపతి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ మృదుల, యోగ మాస్టర్ గంగాధర్, ఝాన్సీ పాల్గొని వైద్య సేవలు అందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆయుష్ వైద్య విధానాల ప్రాముఖ్యతను, యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధం

## క్రైస్తవ సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ బిషప్ దుర్గం ప్రభాకర్



సూర్యాపేట బ్యూరో ఏప్రిల్10 వార్త నిర్భయం

తరతరాలుగా వివక్షకు గురై సామాజిక, రాజకీయం,ఆర్థికం, వ్యవసాయము, పరిశ్ర మల పరంగా వెనకబడి ఉన్నటువంటి దళితులు ఆత్మగౌరవం కోసం భారతదేశంలో క్రైస్తవం మతంలో ఉంటే వారికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కులు కాలరాస్తాం అని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం తగదని క్రైస్తవ సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ బిషప్ దుర్గం ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.భారత రాజ్యాంగం ఆర్టికల్ 25,26 కల్పించినటువంటి మత స్వేచ్ఛను అడ్డుకోవడమే అని తెలియజేశారు. దళితులు కాకుండా ఇతర కులాల వారు ఏ మతానికి వెళ్లిన వారికి హక్కులు ఉంటాయి కానీ ఒక దళితులకు మాత్రమే హక్కు లేదు అనడం ఇది పూర్తిగా దళితులపై జరుగుతున్న వివక్ష అని తెలిపారు 1950 ప్రెసిడెంటల్ ఆర్డర్ భారత రాజ్యాంగానికి విరుద్ధమైన ఆర్డర్ అని,వీటిని వెంటనే రాష్ట్రపతి రద్దు చేయాలని అన్నారు. దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని లేకుంటే రానున్న రోజుల్లో ఆమ్ ఆద్మీ పార్టీ దళిత క్రైస్తవుల పక్షాన పోరాడుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘం నాయకులు పాస్టర్ రాజు ఉటుకూరి, రెవ. పంది మార్క్,రెవ. ఏర్పుల క్రిస్టోఫర్, పాస్టర్ కొండేటి లాజర్, పాస్టర్ ప్రేమ్ సాగర్, కత్తుల సుధాకర్, రెవ. సి. హెచ్. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కళ నెరవేరుతుంది..

## పేదల మొహంలో చిరునవ్వు చూడటమే మా ప్రజా ప్రభుత్వ ద్వేయం..

## ఇచ్చిన మాట నెరవేర్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం....




సూర్యాపేట బ్యూరో ఏప్రిల్10 వార్త నిర్భయం

ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతీ ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఏఐసీసీ సభ్యులు లిరాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఛివ్వేంల మండలంలోని గుంపుల గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు ధారావత్ వీరన్న నాయక్ తో కలిసి లబ్ధిదారులు షేక్ పర్వీన్ బేగం అబ్దుల్ హమీద్( బషీర్) ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పి పదేళ్లు ఊరించిన గత ప్రభుత్వం ఒక్కరికైనా పక్కా ఇల్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని గుర్తుచేశారు. ప్రతీ ఏడాది నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున మంజూరు చేసి ప్రతి పేదోడికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు."ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ద్వేయం" అని పేర్కొన్నారు.గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని చెప్పి పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని సర్వోత్తమ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాసం లింగారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిట్ట రాజశేఖర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆవుల నాగయ్య, కిన్నెరా శ్రీను, పిట్ట సైదిరెడ్డి, తందర్పల్లి వీరయ్య, మండల కాంగ్రెస్ నాయకులు దుబ్బాక ప్రభాకర్ రెడ్డి, గుంజాలరు సర్పంచ్ బొల్లికొండ సైదులు, తిరుమలగిరి (జి ) సర్పంచ్ నాగయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజాద్ అలి, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వాణిజ్య సెల్ చైర్మన్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరెని శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, సేవదల్ చీఫ్ ఆలేటి మాణిక్యం, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్న మధుకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చెంచల నిఖిల్, నారాయణ ప్రవీణ్ రెడ్డి,నాగు నాయక్, మద్దెబోయిన శ్రీనివాస్, వాజిద్ మియా పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యం తీసుకోవచ్చు మద్దతు ధర పొందాలి

## ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట బ్యూరో ఏప్రిల్ 10 వార్త నిర్భయం

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాజా నాయక్ తండలో సర్పంచ్ లూనావత్ శాంతాబాయి పాండునాయక్ తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ కులాల వద్దనే ధాన్యాన్ని శుభ్రం చేసుకుని తీసుకురావాలన్నారు. పంట పండించిన రైతులకు ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడొద్దని ఉద్దేశంతో నాడు కాంగ్రెస్ పార్టీ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని రైతుల సంక్షేమం అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఐకెపి కేంద్రాలతో రైతులు సులువుగా ధాన్యాన్ని విక్రయించుకోవడంతో పాటు మహిళలు ఆర్థిక అభివృద్ధి కూడా సాధిస్తున్నారని చెప్పారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిసర ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మోశయ్య, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, ఉప సర్పంచ్ భూక్యా నాగమణి లోక నాయక్, వార్డు సభ్యులు భూక్యా సురేష్, శ్రీనివాస్, లూనావత్ సుక్కో, శంకర్, కిషన్, జైల్ సింగ్, సురేష్, కిస్టపతి, రాజేశ్వరి, లక్ష్మీ, సాయి, వివికె బాలాజీ తదితరులు పాల్గొన్నారు.